
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
బుధవారం, 23 అక్టోబరు 2024





ఫేస్ టు ఫేస్



పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

కె.చందన్‌కుమార్, ఖమ్మం డీసీఎస్‌వో

ప్రశ్న: ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఎంత వరకు వచ్చింది ..?

జవాబు : ఖమ్మం జిల్లాలో 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇప్పటివరకు 24 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.

ప్ర: ఈసారి లక్ష్యం ఎలా ఉంది..?

జ: ఈ ఏడాది 4 లక్షల 29,630 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. గన్నీ బ్యాగులు, టార్పాలిన్స్, తూర్పార పట్టే మిషన్లు సిద్ధంగా ఉంచుతున్నాం.

ప్ర: బయటి ధాన్యం వస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..?

జ: ఈ సారి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం మన జిల్లాలోకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో 20చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. వీటిని కలెక్టరేట్‌కు అనుసంధానం చేశాం. అంతే కాదు కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర: ధాన్యం మిల్లింగ్ విషయంలో జిల్లాలో అక్రమాలు జరిగాయి కదా.. చర్యలు తీసుకుంటున్నారా?

జ: అక్రమాలు జరిగిన మూడు మిల్లుల్లో ఒక మిల్లుపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. మరో రెండు మిల్లులపై చర్యలు చేపట్టనున్నాం. జిల్లాలో ఉన్న 65 మిల్లులకు ఈసారి ధాన్యాన్ని కేటాయించేది లేదు. గతంలో పద్ధతిగా ఇచ్చిన మిల్లులకు పర్‌ఫార్మెన్స్ చూపించిన మిల్లులకే ధాన్యాన్ని కేటాయిస్తాం.

ప్ర: ఈసారి మిల్లుల నుంచి బ్యాంకు ష్యూరిటీ తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.. వాస్తవమేనా..?

జ: అదేం లేదు. ప్రభుత్వం ఏ విధానాన్ని నిర్దేశిస్తే దానినే అమలుచేస్తాం. ఇప్పటి వరకు అలాంటి ఆదేశాలేమీ రాలేదు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

ఎల్లుండి గవర్నర్ జిష్ణుదేవ్ రాక

- భద్రాద్రి ఆలయంలో పూజలు
- కొత్తగూడెం, ఖమ్మంలో అధికారులు, సాహిత్యకారులతో వేర్వేరుగా భేటీ
- రేపు రాత్రికే సారపాక ఐటీసీ అతిథి గృహానికి రాక



భద్రాచలం/ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకోనున్నారు. సూర్యాపేట నుంచి గురువారం సాయంత్రం 4గంటలకు బయలుదేరి రాత్రికి బూర్గంపాడు మండలం సారపాక ఐటీసీ అతిథిగృహానికి చేరుకుంటారు. శుక్రవారం ఉదయం 8గంటలకు అక్కడినుంచి బయలుదేరి ఉదయం 8:10 గంటలకు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కొత్తగూడెం కలెక్టరేట్‌కు చేరుకోనున్నారు.

అక్కడ జిల్లా అధికారులతో సమావేశమవుతారు. 10గంటలకు కలెక్టర్‌చే ఎంపిక చేయబడిన రాష్ట్ర, జాతీయస్థాయికి చెందిన ప్రముఖ రచయితలు, కవులు, కళాకారులు తదితర రంగాల వారితో గవర్నర్ భేటీ అవుతారు. అనంతరం ఉదయం 11 గంటలకు అక్కడినుంచి బయలుదేరి ఖమ్మంలోని ఎన్నెస్పీ అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడ భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌కు వెళ్లి అధికారులతో సమావేశం కానున్నారు. సాయంత్రం మూడు గంటలకు ఖమ్మం జిల్లాలోని రాష్ట్ర, జాతీయ స్థాయికి చెందిన కవులు కళాకారులు రచయితలతో భేటీ అవుతారు. నాలుగు గంటలకు ఖమ్మం కలెక్టరేట్ నుంచి బయలుదేరి రాత్రి 7:30కు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. ఈ పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెంట గవర్నర్ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేశం, సంయుక్త కార్యదర్శి జే.భవానిశంకర్, ఏడీసీ అమన్ కుంద్‌తోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొననున్నారు .

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: అదనపు కలెక్టర్



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రొటోకాల్ పరంగా అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. జిల్లా అధికారులతో ఇంటరాక్ట్ సందర్భంగా అన్ని శాఖలకు సంబంధించి పీపీటీని రూపొందించాలన్నారు. బుధవారం మధ్యాహ్నంలోగా తమ తమ శాఖలకు సంబంధించి స్లైడ్స్ పంపాలన్నారు. శాఖలకు సంబంధించి స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.



కాటన్ దొంగలు..

నిఘా లేకుంటే దగానే..

పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలపై దళారుల కన్ను పడింది. ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయనున్న సీసీఐ కొనుగోలు కేంద్రాలకు ప్రైవేటు వ్యాపారులు పత్తిని తరలించి రైతుల పేర్లతో అమ్మి సొమ్ము చేసుకునే అవకాశం ఉంది. రెవెన్యూ, మార్కెటింగ్, సీసీఐ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే రైతులకు దక్కాల్సిన గిట్టుబాటు ధర వ్యాపారుల పాలయ్యే అవకాశం ఉంది.

సీసీఐ కొనుగోలు కేంద్రాలపై దళారుల కన్ను

- గ్రామాల్లో ఇప్పటికే పత్తి కొనుగోళ్లు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు
- రైతుల పేర్లతో తిరిగి సీసీఐలో విక్రయించే అవకాశం
- తక్కువ ధరకు కొని ఎక్కువకు అమ్ముకునేందుకు సిద్ధం
- పత్తి ఎక్కువగా సాగయ్యే మండలాల్లో కేంద్రాలు ఏవీ?

ఖమ్మం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పత్తి సీజన్ మొదలైనందున సీసీఐ దశలవారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలోని జిన్నింగ్‌మిల్లులో ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 9చోట్ల సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు, పొన్నెకల్, మధిర మండలం మాటూరు, దెందుకూరు, ఇల్లెందులపాడు, ముదిగొండ మండలం సువర్ణాపురం, తల్లాడ మండలం తల్లాడ, తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని ఇంకా ప్రారంభించాల్సి ఉంది.

నిఘా తప్పనిసరి..

సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్దకు పత్తి అమ్మకానికి తెచ్చిన రైతుల వివరాలపైనా మార్కెటింగ్, వ్యవసాయశాఖలు గ్రామస్థాయిలో గట్టి నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. పత్తి వేయకపోయినా వేసినట్టు వ్యవసాయాధికారుల నుంచి ధ్రువీకరణ పొందితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొందరు రైతులు సూచిస్తున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతుల పత్తికంటే వ్యాపారుల పత్తే అధికంగా వచ్చే అవకాశం ఉందని ఖమ్మంరూరల్ మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభ సమయంలో కొందరు రైతు సంఘాల నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ప్రస్తుతం 9కొనుగోలు కేంద్రాలు సీసీఐ ప్రతిపాదించి ఒకటి ప్రారంభించగా మరో నాలుగు కేంద్రాలు ఈ వారంలో ప్రారంభకానున్నాయి. ఖమ్మం జిల్లాలో సుమారు లక్షా 80వేల ఎకరాల్లో పత్తి వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ లక్షన్నర ఎకరాల వరకు (మిగతా 6వ పేజీలో)

ప్రైవేటు వ్యాపారుల కొనుగోళ్లు

ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ పత్తి కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ క్వింటాకు నాణ్యతను బట్టి రూ.7,521, రూ.7,445, తేమ ఎక్కువ ఉంటే రూ.7,220వరకు ధర నిర్ణయించింది. తేమ శాతంతో పాటు పింజ పొడుగు వచ్చే నాణ్యత బట్టి ధర నిర్ణయిస్తుంది. గరిష్ట ధర రూ.7,521కాగా కనిష్ట ధర రూ.7,220వరకు సీసీఐ ధర ఉంది. అయితే ప్రైవేటులో జిల్లాలో పత్తి వ్యాపారులు రైతులకు గతంలో పెట్టిన పెట్టుబడులతో పాటు వర్షాల వల్ల నాణ్యత లేదని, నల్లబడిందని చెబుతూ క్వింటాకు రూ.6వేల నుంచి రూ.6,500 వరకే ధర చెల్లిస్తున్నారు. దీనికి తోడు తారం పేరుతో రైతులను మోసం చేస్తున్నారు.

సీసీఐ మద్దతు ధరకు ప్రైవేటు వ్యాపారులు చెల్లించే ధరకు క్వింటాకు రూ.1,000 వరకు వ్యత్యాసం ఉంది. పత్తి వ్యాపారులు రైతులనుంచి పత్తి కొనుగోలు చేసి కొందరు ఖమ్మం వ్యవసాయమార్కెట్‌కు తెచ్చి అమ్ముతుండగా ప్రస్తుతం సీసీఐ కేంద్రాలు ఏర్పాటవుతున్నందున సీసీఐకి అమ్మితే ఎక్కువ ధర వచ్చే అవకాశం ఉండడంతో గ్రామాల్లో నమ్మకమైన రైతుల పాసుపుస్తకాలు పెట్టి వారి పేర్లతో విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో ప్రైవేటు వ్యాపారులు, దళారులు పత్తి అమ్ముకుని సొమ్ము చేసుకునే అవకాశం నెలకొంది.


లింగస్వామి


కావేరి

పత్తి చేనులో పెను విషాదం

- పిడుగుపాటుకు తండ్రి, కూతురు మృతి
- వేపచెట్టు కింద కూర్చున్న సమయంలో పడిన పిడుగు
- అక్కడికక్కడే ఇద్దరూ మృతి..
- స్పృహ కోల్పోయిన భార్య 6

విడిపోని పేగుబంధం

- కొడుకు మృతదేహం వద్ద రోదిస్తూ తల్లి మరణం
- ఒకరోజు వ్యవధిలోనే ఇద్దరి మృతి
- ఇల్లెందులో విషాదం
- మృతుడు నరేందర్.. పీరీల అసర్‌ఖానా మాలిక్ 6
- కొడుకు అంత్యక్రియలు పూర్తి.. నేడు తల్లికి నిర్వహణ


నరేందర్


సులోచన


దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

పకడ్బందీగా కేంద్ర పథకాల అమలు

- అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- పథకాల సమాచారం ప్రజాప్రతినిధులకు తెలియజేయాలి
- పరిశ్రమల ఏర్పాటుకు నివేదికలు తయారుచేయాలి
- దిశ కమిటీ సమావేశంలో ఎంపీ రఘురాంరెడ్డి
- హాజరైన ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఖమ్మం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలుచేయాలని ప్రజలకు లబ్ధిచేకూరేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు సంబంధించిన సమాచారం ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం జరిగింది. ఎంపీ రఘురాంరెడ్డితోపాటు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. శాఖలవారీగా జరుగుతున్న పనులు ఆయా శాఖల్లోని కేంద్ర ప్రభుత్వ పథకాలను సమీక్షించారు. జిల్లా స్త్రీశిశుసంక్షేమ, పౌరసరఫరాలు, గ్రామీణాభివృద్ధి, విద్యా వైద్యం, వ్యవసాయం, విద్యుత్, జాతీయ (మిగతా 6వ పేజీలో)

20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్

- వైరా నడిబొడ్డున నిర్మించేందుకు ప్రతిపాదనలు
- టీజీఆర్ఎస్, టీజీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ స్థలాల గుర్తింపు
- పేద విద్యార్థులకు అందుబాటులోకి రానున్న మెరుగైన విద్య

వివరాలు : 7లో

హైటెక్ దొంగల ఆటకట్టు

- కొత్తగూడెంలో ఈ నెల 10న సినీఫక్కీలో చోరీ
- కారు నుంచి 19 తులాల బంగారం మాయం
- సీసీ కెమెరాల ఆధారంగా నలుగురి అరెస్టు

వివరాలు : 7లో

ఇదేం బిర్యానీ..?

- దుర్వాసనపై కానిస్టేబుల్ ఫిర్యాదు
- హోటల్లో తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం బైపాస్ రోడ్డులోని శ్రీశ్రీశ్రీ రెస్టారెంట్‌కు సోమవారం ఓ పోలీసు కానిస్టేబుల్ వెళ్లాడు.. సంతృప్తిగా బిర్యాని తినేందుకు ఆర్డర్ చెప్పాడు. తీరా బిర్యాని ప్లేట్‌లోకి రాగానే దుర్వాసన వచ్చింది. ఇదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానం వచ్చింది. దీంతో ఆ కానిస్టేబుల్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆహార తనిఖీ నాణ్యతా ప్రమాణాల అధికారికి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించాల్సిన అధికారులు కన్నెత్తి చూడ లేదు. మంగళవారం మాత్రం ఆరోపణలు వ్యాపించిన శ్రీశ్రీశ్రీ రెస్టారెంట్‌లో ఆహార తనిఖీ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. నాసిరకం రంగులు వాడిన బిర్యానీతోపాటుగా కల్తీ కారం ఉన్నట్టు అంచనా వేసిన అధికారులు బిర్యాని కారం శ్యాంపిల్స్‌ను సేకరించారు. నాణ్యతా పరీక్షల కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు శ్యాంపిల్స్ పంపిస్తున్నామని తెలిపారు. నగరంలోని హోటళ్లలో శుచీశుభ్రత మళ్లీ మొదటికొచ్చింది.





లాభాల సాగు



పూల సాగు బహు బాగు

- సిరులు కురిపిస్తున్న జరబరా పూలు
- ఒకప్పుడు బెంగుళూరు, ఊటీలకే పరిమితం
- మధిరలో సాగుచేస్తున్న మల్లాది హనుమంతరావు





మధిర టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేడుక ఏదైనా.. ఎటువంటి డెకరేషన్‌లోనైనా జరబరా పూలు ఉండాల్సిందే. ఒకప్పుడు బెంగుళూరు, ఊటీ వంటి ప్రాంతాలలో మాత్రమే సాగయ్యే జరబరా పూలు నేడు మధిరలో కూడా సాగు చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు మధిరకు చెందిన రైతు మల్లాది హనుమంతరావు.

వ్యవసాయంపై మక్కువ కలిగిన హనుమంతరావు ఆధునిక పద్ధతుల్లో ఎవరూ చేపట్టని విధానంలో సాగు చేయాలనే ఆలోచనతో పాలీహౌజ్‌లో జరబరా పూల సాగును ఎంచుకొని రాష్ట్రంలో హైదరాబాద్ చుట్టు ప్రక్కల చేవెళ్ల, వికారాబాద్, ఇబ్రహింపట్నం ప్రాంతాల్లో సాగవుతున్న విషయాన్ని తెలుసుకొని అక్కడికి వెళ్లి పరిశీలించి మధిరలో సాగు చేస్తున్నాడు. పాలీహౌజ్ నిర్మాణానికి రూ. 60లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, దీనికి హార్టికల్చర్ బోర్డు ద్వారా 50శాతం సబ్సిడీ లభిస్తుందనే విషయాన్ని తెలుసుకొని వెంటనే పనులు ప్రారంభించి మధిర సమీపంలోని ఆత్కూరులో తనకు ఉన్న ఎకరం పొలంలో పాలీహౌజ్ నిర్మించి సాగుకు ఉపక్రమించాడు.

అడుగున్నర ఎత్తులో మట్టి బెడ్లు ఏర్పాటు చేసి పూణే నుంచి ఒక్కో మొక్కకు రూ.42 వెచ్చించి 20వేల మొక్కలను తీసుకువచ్చి నాటాడు. వర్షపు నీటిని సేకరించేందుకు ఐదువేల లీటర్ల సామర్థ్యం గల సంపు నిర్మించి అక్కడి నుంచే మోటర్లు ఏర్పాటు చేసి మొక్కలకు డ్రిప్ ద్వారా నీరు, ఎరువు అందించడంతో పాటు పాలీహౌజ్‌లో వాతావరణం చల్లగా ఉండేందుకు ఎప్పటికప్పుడు చల్లని నీరు వెదజల్లేందుకు ఫాగింగ్ పరికరాలను అమర్చాడు. చల్లటి వాతావరణంలో పెరిగే మొక్క కావడం అందులో మే నెలలో నాటడంతో కొంత ప్రతికూలత ఏర్పడి తెగుళ్లు సోకి మొక్కలు చనిపోతున్నా, ఉద్యానశాఖ అధికారుల సలహాతోపాటు వ్యవసాయంలో తనకు ఉన్న అనుభవంతో సంరక్షించాడు. నాటిన ఐదు నెలలకు పూలు కోతకు రావడం మొదలైంది. క్రమంగా దిగుబడి పెరిగి నేడు రోజుకు రెండున్నర వేల నుంచి మూడు వేల పూలు దిగుబడి వస్తుంది.

ఒక్కో పువ్వును తోట వద్దే ఆరు రూపాయలకు విక్రయిస్తున్నారు. సీజనల్‌లో అయితే ఒక్కో పువ్వు రూ.10కి పైగానే పలికే అవకాశం ఉంది. సరాసరి రోజుకు రూ. 12వేల నుంచి రూ.15వేల వరకు అమ్మకం ద్వారా వస్తుంది. స్థానికంగా డిమాండ్ లేకపోతే వెంటనే ప్యాకింగ్ చేసి విజయవాడకు పంపుతూ ఆదాయాన్ని గడిస్తున్నాడు. ఒక్కసారి నాటితే ఐదేళ్లపాటు దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చే జరబరా పూలసాగు చేపట్టడమే కాకుండా రోజుకు ఐదుగురు కూలీలకు పనికల్పిస్తూ మరెందరో యువ రైతులకు స్ఫూర్తి దాయకంగా నిలిచాడు.



సవాళ్లను అధిగమించి సాగు చేశా..

మల్లాది హనుమంతరావు, రైతు.

ఇక్కడ వేడి ఎక్కువగా ఉండటంతో సాగులో మొదట అనేక తెగుళ్లు సోకడం, మొక్కలు చనిపోవడం జరిగినా ఉద్యానవన అధికారులు సూచనలు, తాను సాంప్రదాయ వ్యవసాయంలో వాడే మందులు పిచికారితో నష్టనివారణ చేసి సవాళ్లను అధిగమించి దిగుబడి సాధించా. మరింతమంది రైతులు జరబరా సాగుకు ముందుకు వస్తే దిగుబడులు పెరిగితే కొనుగోలుదారులు మన దగ్గరికే వచ్చే అవకాశం ఉంది. సాగు చేయదలసిన రైతులు తనను 99892 77637 నెంబర్ ద్వారా లేదా నేరుగా సంప్రదిస్తే తగు సలహాలు, సూచనలు అందిస్తా.



రవాణా ఖర్చులు కలిసి వస్తున్నాయి..

ఆదిత్య డెకరేషన్, ఈవెంట్ ఆర్గనైజర్

స్థానికంగానే జరబరా పూలు లభిస్తుండటంతో విజయవాడ పోవాల్సిన అవసరం లేకుండా పోయింది తద్వారా రవాణా ఖర్చులు కలిసివస్తున్నాయి. వీటికి తోడు డెకరేషన్‌లో వాడే స్నోబాల్స్ కిసాంతకాలు, గులాబీలు, గ్రాస్ కూడా ఇక్కడ రైతులు పండిస్తే మరింత మేలు జరుగుతుంది.

డమ్మీ తుపాకీతో బెదిరింపులు

- మాజీ నక్సలైట్‌ను పట్టుకున్న గ్రామస్థులు
- నిందితుడు రాయల వెంకటేశ్వర్లు పల్లిపాడు వాసి
- ఇప్పటికే 15 కేసులు

దామెర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నకిలీ తుపాకీ (డమ్మీ ఎయిర్‌గన్)తో బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న మాజీ నక్సలైట్‌ను గ్రామస్థులు పట్టుకోగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన రాయల వెంకటేశ్వర్లు (మాజీ నక్సలైట్) సోమవారం రాత్రి 12 గంటల సమయంలో ఊరుగొండ గ్రామ ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సు దిగాడు. అక్కడే మూసి ఉన్న కందికొండ సంపత్ కిరాణాషాపు షట్టర్‌ను తట్టాడు. షట్టర్ తీసిన యజమాని సంపత్‌ను.. తనకు సిగరేట్ కావాలంటూ వెంకటేశ్వర్లు అడిగాడు. దీంతో సంపత్ షట్టర్ పైకి లేపి సిగరేట్ ఇచ్చే క్రమంలోనే వెంకటేశ్వర్లు తన జేబులో ఉన్న నకిలీ తుపాకీ(ఎయిర్ గన్)తీసి సంపత్‌కు చూపించాడు. తాను మాజీ నక్సలైట్‌ను అని, డబ్బులు కావాలని బెదిరిస్తూ డిమాండ్ చేశాడు. తన వద్ద డబ్బులు లేవని సంపత్ సమాధానం చెప్పడంతో కాళ్లతో తన్ని కింద పడేశాడు. నకిలీ తుపాకీ చూపిస్తూ కిరాణా షాపులోని గల్ల పెట్టెలో ఉన్న రూ.2000 తీసుకున్నాడు. అంతటితో ఆగకుండా తాను ప్రజా ప్రతిఘటన నక్సలైట్ పార్టీకి చెందిన వ్యక్తిని అని, ఈ విషయం ఎవరికైనా చెబితే మళ్లీ మధ్య రాత్రి ఎప్పుడైనా వచ్చి చంపేస్తా.. అంటూ బెదిరించాడు. ఈ క్రమంలో షాపు యజమాని సంపత్ నకిలీ నక్సలైట్ వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి నకిలీ తపాకీని లాక్కొని అతడి పట్టుకున్నారు. వెంటనే 100కు డయల్ చేయగా, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కాగా, రాయల వెంకటేశ్వర్లు మాజీ నక్సలైట్ అని, అతడిపై పలు కేసులు ఉన్నాయని పరకాల ఏసీపీ ఇ.కిషోర్‌కుమార్ తెలిపారు. వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పని చేసి 2007లో లొంగిపోయినట్టు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు వెళ్లి కోఠి ఏరియాలో ఓ నకిలీ తుపాకీ కొనుగోలు చేసి ఖమ్మం చుట్టు పక్కల ప్రాంతాల్లో డబ్బులు వసూలు చేయగా అక్కడి పోలీస్‌స్టేషన్లలో 10కి పైగా కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో ములుగు రోడ్డు వద్ద ఆటో ఎక్కి గూడెప్పాడ్ వైపునకు వెళ్తూ మార్గమధ్యలో ఊరుగొండ గ్రామ రోడ్డు పక్కన ఉన్న కందికొండ సంపత్ కిరాణా షాపులో చోరీకి పాల్పడ్డాడని ఏసీపీ కిషోర్‌కుమార్ వివరించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కూరగాయలు కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	48
వంకాయ	44
గుత్తి వంకాయ	50
బీరకాయ	48
పచ్చిమిర్చి	58
కాకరకాయ	50
బెండకాయ	44
పొట్లకాయ	48
దోసకాయ	48-58
గోరుచిక్కుడు	50
క్యాబేజీ	34
దొండ	40-48
సొరకాయ	40
క్యారెట్	54
క్యాప్సికం	88
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

ఐటీడీఏ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగ
ప్రవేశ పరీక్షలకు శిక్షణ

భద్రాచలం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగాల ప్రవేశ పరీక్షల కోసం అర్హులైన ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులకు 60 రోజుల ఉపాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు.

ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్టడీసర్కిల్.సిజిజి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 27 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదని, ఎంపికైన వారికి నెలవారీ స్కాలర్‌షిప్పు, స్టడీ మెటీరియల్, ఇతర పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 040-27540104లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఆర్టీసీ రీజియన్ పరిధిలోని షాపులకు
ఆన్‌లైన్ టెండర్ల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలోని బస్టాండ్‌లలో కమర్షియల్ షాపులకు ఆన్‌లైన్ విధానంలో టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ (ఆపరేషన్స్)జీఎన్ పవిత్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు నేటి నుంచి నవంబరు 6వ తేదీలోగా ఆన్‌లైన్ టెండర్లు వేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963507506 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నిఘా లేకుంటే దగానే..

(5వ పేజీ తరువాయి)

పత్తి సాగు చేశారు. జిల్లాలో పత్తి దిగుబడులు కొన్నిచోట్ల తగ్గినా మిగిలిన చోట ఆశాజనకంగానే వచ్చే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం మార్కెటింగ్ ఏడీ పరిధిలో కూడా నాలుగు చోట్ల సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసింది. సుజాతనగర్ మండలం డేగలమడుగు, అశ్వాపురం మండలం నెల్లిపాక, సింగరేణి, బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఆ మండలాల్లో కొనుగోలు కేంద్రాలేవీ ?

సీసీఐ ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పత్తి అధికంగా పండే ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాల్సి ఉన్నా జిన్నింగ్ మిల్లులు లేవనే సాకుతో ఏర్పాటు చేయలేదు. వాస్తవానికి సీసీఐ పత్తి ఉత్పత్తి అయ్యే చోటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి కొనుగోలు చేసి జిన్నింగ్ మిల్లులకు తరలించాలి. ఉదాహరణకు చింతకాని, ఖమ్మం, కొణిజర్ల మండలాలకు ఖమ్మంలో లేదా రఘునాథపాలెంలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాల్సి ఉన్నా ఏర్పాటు చేయలేదు. పాలేరు నియోజకవర్గంలో 4 కొనుగోలు కేంద్రాలు, మధిర నియోజకవర్గంలో 3 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైరా నియోజకవర్గంలో పత్తి అధికంగా పండుతుంది. కొణిజర్ల, వైరా, కారేపల్లి, జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో పత్తి సాగు అధికంగా ఉన్నా ఎక్కడా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు.

ఉమ్మడి జిల్లాలోనే పత్తి ఉత్పత్తికి వైరా నియోజకవర్గం పేరు పొందింది. కారేపల్లి మండలంలో కూడా అధికంగా పత్తి సాగవుతోంది. కామేపల్లి, రఘునాథపాలెం మండలాలు కలిపి రఘునాథపాలెంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేస్తే సౌలభ్యంగా ఉండేది. అలాగే వైరాలో కూడా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు, చంద్రుగొండ, కొత్తగూడెం, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో పత్తి అధికంగా సాగవుతుంది. అక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఖమ్మం జిల్లా పరిధిలో సుమారు 5లక్షల క్వింటాళ్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లక్షా 60వేల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే దళారుల వైపు వెళ్లకుండా సీసీఐ కేంద్రాల వద్దకు రైతులు పత్తిని తీసుకెళ్లి అమ్మే అవకాశం ఉంటుంది.

పకడ్బందీగా కేంద్ర పథకాల అమలు

(5వ పేజీ తరువాయి)

రహదారులతోపాటు పలు శాఖల పథకాలు, పనుల గురించి ఎంపీ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన బ్యాటరీ ట్రైసైకిళ్లు ఎన్ని కావాలో సమాచారం ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించి కేంద్ర పథకం ద్వారా నిధులు కూడా మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు నివేదికలు తయారుచేయాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, జిల్లాలో ఎక్కువగా పెట్టుకునేందుకు సౌకర్యాలున్నాయని, ఆహారశుద్ధి పరిశ్రమలు అవసరం ఉందని, ఇందుకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలన్నారు. జిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు క్లస్టర్లవారీగా గుర్తించాలని సీసీఐ ద్వారా జిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

విద్యాశాఖపై సమీక్ష జరుగుతున్న తరుణంలో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి కొందరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్లపై పంపించారని ప్రొటోకాల్ విషయంలో ఒక హెడ్మాస్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయనపై చర్యలు తీసుకోలేదని ప్రస్తావించారు. దీనికి ఎంపీ రఘురాంరెడ్డి స్పందిస్తూ దీనిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించినా, ప్రొటోకాల్ విషయంలో నిబంధనలు పాటించకపోయినా ఎవరైనా సిబ్బంది అవినీతికి పాల్పడినా ఉపేక్షించవద్దని సూచించారు. సత్తుపల్లిలో మంజూరైన ఆస్పత్రుల నిర్మాణంలో నిర్లక్ష్యం జరుగుతుందని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



దిశ కమిటీ సమావేశానికి హాజరైన అధికారులు

జిల్లాలో మంజూరైన జాతీయ రహదారులు సకాలంలో పూర్తిచేయాలని భూసేకరణ పెండింగ్ పనులు పూర్తికావాలన్నారు. ఖమ్మం-సత్తుపల్లి రహదారి మరమ్మతు పనులు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. 2025 మార్చి నాటికి ఖమ్మం-దేవరపల్లి జాతీయరహదారి పనులు పూర్తిచేయాలని ఎంపీ సూచించారు. అటవీ ప్రాంతంనుంచి వచ్చే ఇసుకను సొంత అవసరాలకు వాడుకునేందుకు మాత్రమే అనుమతించాలని మైనింగ్ అధికారులకు సూచించారు. వచ్చే వేసవి నుంచి పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయబోతోందని, రైతుల తరుపున బీమా ప్రభుత్వం చెల్లిస్తుందని దీనికి సంబంధించి ఇప్పటినుంచే అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో అవసరం ఉన్న అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేయడం జరుగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సుగమ్య భారత్ అభియాన్ కింద దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లు చిన్నవి వస్తున్నాయని, పాలు, ఇతర పదార్థాలు నాణ్యతగా ఉండడంలేదని తెలుపగా, దీనిపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం అందించడం జరుగుతుందని, బియ్యం అక్రమ రవాణపై తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో కూడా సదరం క్యాంపు నిర్వహణకు ప్రణాళిక సిద్ధంచేస్తున్నామని ప్రకటించారు. జిల్లాలో 15వేల వరకు పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, డయాలసిస్, బోదకాలున్నవారికి కూడా పింఛన్లు మంజూరుకావాల్సి ఉందన్నారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా బ్రిడ్జికి మరమ్మతు పనులు సత్వరం చేపట్టాలని, అలాగే ఖమ్మం-వైరా రహదారికి మరమ్మతులు చేయాలని, ప్రమాదాలు నివారించాలని కోరారు. గత పదేళ్లలో పేదలకు ఇళ్లు మంజూరుకాలేదని, పెద్దఎత్తున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేయబోతున్నందున ఇసుక సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట, డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్‌సింగ్, జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, అధికారులు పాల్గొన్నారు.

పత్తి చేనులో పెను విషాదం





లింగస్వామి, కావేరి మృతదేహాలు

కామేపల్లి, అక్టోబరు 22: పిడుగుపాటు నిండు కుటుంబంలో విషాదాన్ని నింపింది. తండ్రీకూతుళ్లను ఒకే సమయంలో బలిగొంది. ఈ ఘటన కామేపల్లి మండలం ముద్దులపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. ముద్దులపల్లికి చెందిన చింతల లింగస్వామి(38) తనకున్న పోడు భూమిలో సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత పత్తి, కొంత మొక్కజొన్న వేశాడు. లింగస్వామికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కూతురు కావేరి(18) కారేపల్లిలో ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. మంగళవారం ఆమె కాలేజీకి వెళ్లేందుకు సిద్ధం కాగా, పత్తి తీయడానికి కూలీలు రావడం లేదని, ఈ ఒక్కరోజు పత్తి తీసేందుకు రావాలని తల్లి శైలజ బుజ్జగించింది. దీంతో తల్లిదండ్రులతో కలిసి కావేరి పత్తి చేనుకు వెళ్లింది. పత్తి తీస్తున్న క్రమంలో మధ్యాహ్న సమయంలో వర్షం రావడంతో లింగస్వామి, కావేరి చేనులో ఉన్న వేప చెట్టు కిందికి వెళ్లి కూర్చున్నారు. భార్య శైలజ కొంత దూరంలో నిల్చుంది.

ఈ క్రమంలో ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా వేపచెట్టు మొదట్లో పిడుగు పడింది. దీంతో లింగస్వామి, కావేరి.. అక్కడికక్కడే మృతి చెందారు. భార్య శైలజ స్పృహ కోల్పోయింది. ఇది చూసిన పక్క రైతులు గ్రామస్థులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి స్పృహ కోల్పోయిన శైలజను అంబులెన్స్‌లో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చెట్టు కింద విగతజీవులుగా పడి ఉన్న తండ్రీకూతుళ్లను చూసి కన్నీరుమున్నీరయ్యారు. కాగా, సంఘటన స్థలాన్ని తహసీల్దార్ సుధాకర్, సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కామేపల్లి ఎస్ఐ సాయికుమార్ పరిశీలించారు. మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెరుగైన వైద్యం అందేలా కృషి

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించేలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి ఆవరణాన్ని పరిశీలించారు. ఆ తర్వాత వైద్యులతో కలిసి వార్డులు, ఇతర విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి పాతభవనం కావడంతో వర్షాకాలంలో కురుస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆస్పత్రి భవనం పైకి ఎక్కి పరిశీలించారు. దీనికి తీసుకోవాల్సిన మరమ్మతులు, కావాల్సిన నిధులపై వారితో సంప్రదించారు. ఆ తర్వాత వైద్యులతో సమావేశమయ్యారు. ఆస్పత్రికి ఎంత కెపాసిటీ ఉంది. రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారని ప్రశ్నించారు. 570బెడ్లు రోజుకు 2000మంది ఓపీ వస్తుందని తెలిపారు. మందుల సరఫరా, కొరత ఏమైనా ఉందా.. ఇంకా ఆస్పత్రికి కావాల్సిన సౌకర్యాలు సదుపాయాలపై ఎంపీ అడిగారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐ మిషన్ లేదని వివరించారు. వైద్య కళాశాల ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేరని వివరించారు. స్పందించిన ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎంఆర్ఐ ఇతర సదుపాయాలు, మరమ్మతులకు నిధులు అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులను కేటాయిస్తానని చెప్పారు.మార్చురీలో నాలుగు ఫ్రీజర్లను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళావతి భాయి, డాక్టర్ వినాయక్ రాథోడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, కొప్పుల చంద్రశేఖర్, మిక్కిలినేని నరేందర్, దుంపల రవి, రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.



ఆస్పత్రిని సందర్శిస్తున్న ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి ఆస్పత్రి అధికారులు

వీడని పేగుబంధం

- కొడుకు మృతదేహం వద్ద రోదిస్తూ తల్లి మరణం

ఇల్లెందు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొడుకు మరణంతో గుండె పగిలిన ఆ తల్లి.. అంత్యక్రియల సమయంలో కొడుకు మృతదేహంపై పడి ప్రాణాలు విడిచింది. హృదయ విదారకమైన ఈ ఘటన మంగళవారం భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణంలో జరిగింది. ఈ ఘటనలో పీరీల అసర్‌ఖానా మాలిక్ నరేందర్, ఆయన తల్లి సులోచన కన్నుమూశారు.ఇల్లెందు జగదాంబసెంటర్ సమీపంలోని పీరీల అసర్‌ఖానా మాలిక్ (పూజారి)గా వున్న పసుపులేటి నరేందర్(60) హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. అతడి మృతదేహాన్ని సోమవారం సాయంత్రం ఇల్లెందుకు తీసుకొచ్చారు. పెద్ద కుమారుడు నరేందర్ మృతి వార్తను విశాఖపట్నంలో రెండో కుమారుడి వద్ద ఉంటున్న తల్లి సులోచన(86)కు తెలుపడంతో, ఆమె తన రెండో కుమారుడు కృష్ణను వెంట తీసుకొని సోమవారం రాత్రి ఇల్లెందుకు చేరుకుంది. పెద్ద కుమారుడి మృతదేహం చూసి బోరుమన్నది. తెల్లవార్లు మృతదేహం వద్దనే కూర్చొని విలపించింది. మంగళవారం ఉదయం నరేందర్ మృతదేహాన్ని వైకుంఠధామానికి తీసుకెళ్లడానికి ఇంటి వద్ద ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో పాడెపై ఉన్న కొడుకు మృతదేహానికి తుది సంస్కారం (తలకు నూనె, ముఖానికి కుంకుమ తిలకం రాస్తూ) నిర్వహిస్తూ సులోచన కుప్పకూలింది. వెంటనే స్థానిక వైద్యుడిని రప్పించి పరీక్షించగా అప్పటికే ఆమె చనిపోయినట్టు నిర్ధారించారు. ఈ ఘటన ఇల్లెందు పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఒకేసారి రెండు మృతదేహాలకు అంత్యక్రియలు చేయకూడదని కుల పెద్దలు చెప్పడంతో నరేందర్ మృతదేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి సులోచనకు బుధవారం అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. కాగా, మృతుడు నరేందర్.. పీరీల అసర్‌ఖానా మాలిక్‌గా, కాంగ్రెస్ స్థానిక నాయకుడిగా అందరికీ సుపరిచితుడు కావడంతో విషాదం నెలకొంది. నరేందర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

సత్తుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ మద్యం తదితర మత్తు పదార్థాలకు బానిస కాకుండా దూరంగా ఉన్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అంతకముందుగా గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై జరిగిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లాలో పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 94 మందిని గంజాయి పీల్చేవారికి, విక్రయించే వారిని గుర్తించామని, 11 మందిని రిమాండ్‌కు తరలించగా.. మిగతా వారిపై నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, బంధుమిత్రులు సైతం గంజాయి విక్రయాలు, పీల్చడంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వాటిని విక్రయించే వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్టు కింద చర్యలు తప్పక ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి అక్రమ రవాణాపై, వినియోగం నియంత్రణకు విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

గంజాయి, మత్తుమందుల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహనను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉందని, ఈ ప్రమాదం బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని, కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాలు సేవించడంతో మీరు అనుకున్న లక్ష్యాలను సాధించడం ఓ కలగానే మిగిలిపోతుందన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తోందని, ఇందులో భాగంగా గంజాయి పీల్చడం, విక్రయాలపై ప్రత్యేక నిఘా కోసం డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీళ్లుపోశారు. కార్యక్రమంలో కల్లూరు ఏసీపీ రఘు, సీఐలు ముత్తులింగం, టీ.కిరణ్, ఎస్ఐలు నాగరాజు, వీరప్రసాద్, వెంకటేశం, షాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీపీ సునీల్‌దత్

పెండింగ్ కేసులు పరిష్కారానికి
బాధ్యతగా కృషి చేయాలి

» భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్



చంద్రుగొండ ఎస్ఐ స్వప్నను అభినందిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంఅక్టోబరు22:(ఆంధ్ర జ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వర పరిష్కారానికి అధికారులందరూ బాధ్యతగా కృషిచేయాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వాటర్స్‌లోజరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా నిత్యం అవగాహన కార్యక్రమాలు చేస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేసినప్పుడే ప్రజలకు నమ్మకం కుదురుతుందన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసేవాళ్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఫింగర్ ప్రింట్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన చంద్రుగొండ ఎసై స్వప్నను అభినందించారు. ఈసమావేశంలో ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు చంద్రభాను, రహమాన్, సతీష్‌కుమార్, రవీందర్ రెడ్డిలు డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ యస్బీ ఎస్సై ఇన్‌స్పెక్టర్ నాగరాజు, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ జయరాజు, సీఐలు, ఎసైలు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలు ప్రారంభం

» జెండా ఆవిష్కరించిన నాయకులు



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా మహిళా నాయకురాలు

కొత్తగూడెం,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అఖిల భారతప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర4వమహాసభలు కొత్తగూడెం క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. మంగళవారం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బత్తుల హైమావతి ఐద్వా జెండా ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళా పోరాటాలు వర్ధిల్లాలని, మహిళలపై జరుగుతున్న హింసా, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. రైతుచట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించి 720మంది రైతులు మరణించారని, బీజేపీ విధానాలను ప్రతిఘటించి పోరాడాలన్నారు. మాజీఎంపీ, మిడియం బాబురావు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి, బొగ్గుగని కార్మిక ఉద్యమానికి, భద్రాచలం కేంద్రంగా ఆదీవాసీలను ఏకతాటి పైకి తీసుకు వచ్చిన పోరాటయోధులు ప్రాణ త్యాగాలతో ఈజిల్లా పునీతమైందన్నారు. జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉన్నప్పటికీ పాలకుల వివక్ష కారణంగా జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.ప్రసాద్ మాట్లాడుతూ.. 76శాతం మందికి ఉపాధి కల్పిస్తూ దేశానికి అన్నంపెడుతున్న వ్యవసాయ రంగంలో మహిళల శ్రమ కీలకమైందన్నారు. ఉపాధి హామీ చట్టంలో 90శాతం మహిళలు పనిచేస్తున్నారని.. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగారుస్తుందన్నారు. ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి దావలే మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలతో మహిళలకు ముప్పు పొంచి ఉందన్నారు. మహిళలకు చేరువయ్యేలా ఐద్వా కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. అమరులైన లక్ష్మీదేవమ్మ, కృష్ణకుమారిలకు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి దావలే

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు జైలు

ఖమ్మంలీగల్,అక్టోబరు22(ఆంధ్ర జ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరంలోని రాపర్తినగర్‌కు చెందిన నిందితుడైన బ్రహ్మదేవర సోమయ్యకు ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప ఆరునెలలు జైలుశిక్ష, ఫిర్యాదికి నష్టపరిహారం కింద రూ.3లక్షల 60వేలు చెల్లించాలని మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరం ఎస్పీ ఆఫీసు రోడ్డు ప్రాంతానికి చెందిన పాగా బాబులు వద్ద సోమయ్య తన అవసరాల నిమిత్తం 2018లో రూ.2లక్షల 90 వేలు అప్పుగా తీసుకున్నాడు. అదేరోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చినాడు. ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు 2019లో చెక్కు జారీ చేశాడు. ఫిర్యాది ఆ చెక్కును తన బ్యాంకు ఖాతాలో జమ చేయగా నిందితుని ఖాతాలో సరిపడా నగదు లేనందున తిరస్కరణకు గురైంది. దీంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేశాడు. కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేశారు. కేసునువిచారించిన న్యాయాధికారి నేరు రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆటో చోరీ నిందితుల అరెస్ట్

ఖమ్మం క్రైం అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆటో చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కస్బాబజార్‌కు చెందిన సుధాకర్ ఆటో ఇటీవల చోరీకి గురైంది. బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేపట్టారు. నిజాంపేటకు చెందిన ప్రతాప్, దాసరి రాజశేఖర్ చోరీ చేసినట్లుగా గుర్తించి ఇద్దరు నిందితులను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

26 నుంచి రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు22:త్వరలో జాతీయస్థాయిలో జరిగే సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలకు ఈనెల 26నుంచి 30 వరకు సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కళ్యాణపు ఆదర్శ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఉదయం 6.30గంటలకల్లా సికింద్రాబాద్ జింఖానాకు చేరుకోవాలని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో ట్రెయినీ కలెక్టర్ల పర్యటన

» ఏన్కూర్, తిరుమలాయపాలెం, కారేపల్లి మండలాల్లో పర్యటన
» ప్రజల స్థితిగతులపై అధ్యయనం
» అభివృద్ధి పథకాలపై పరిశీలన



ఇస్లావత్‌తండాలో పర్యటిస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ బృందం సభ్యులు

ఏన్కూరు,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ట్రెయినీ కలెక్టర్లు ఖమ్మం జిల్లాలో పర్యటించారు. మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామాన్ని ఐదుగురు సభ్యులతో కూడిన బృందం సందర్శించింది. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లెదవాఖానా, నర్సరీలను పరిశీలించారు ఆయా శాఖల అధికారులతో నిర్వాహణ తీరుతెన్నులను అడిగి తెలుసకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శాఖల వారీగా పరిశీలించారు. పాఠశాల వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య తదితర సౌకర్యాల గురించి ఎంఈవోను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ల బృందం సభ్యులు అంకిత్ యాదవ్, సుల్తాన్ మహ్మద్ షేక్, ఇషాన్‌గుప్తా, శుభం, పంకజ్‌కుమార్‌మీనా, ఎంపీడీవో రమేస్, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంఈవో శ్రీనివాస్, ఏవో నరసింహారావు, ఐకేపీ ఏపీఎం హరి నారాయణ, ఎంపీవో జీవీఎస్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

హల్యాతండాలో పర్యటన

కారేపల్లి: మండల పరిధిలోని హల్యాతండాలో ట్రెయినీ కలెక్టర్లు పర్యటించారు. ప్రజల ఆహారపు అలవాట్లు, స్థితిగతులను పరిశీలించారు. ఐకేపీ మహిళ సంఘాలకు మంజూరు అవుతున్న రుణమంజూరుపై, వాటి రికవరిపై సమీక్షించారు. మంచినీటి సరఫరా, వాటర్‌ట్యాంకుల నిర్వహణపై, పాఠశాలల పనితీరు, అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్లు తేజస్వినితబాని, అనితామీనా, వైభమ్మినా, అల్టామాష్‌హూజీ, విపుల్‌సింఘాల్ పాల్గొన్నారు. ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవిప్రసాద్ పాల్గొన్నారు.

ఇస్లావత్‌తండాలో..

తిరుమలాయపాలెం: మండల పరిధిలోని ఇస్లావత్ తండాలో రూపేష్‌జాల్వాల్, తరుణయ్ పండే, సుమిత్ గోవిందబాయి మక్వానా, అభిషేక్ అందాస్, ఉషాయాదవ్, సామత్ మిలన్ మహిదోయి తదితరులు పర్యటించారు. తండాలో ఎదుర్కొన్న సమస్యలు తెలుసు కున్నారు.అక్కడి గిరిజనుల స్థితిగుతలపై అధ్యయనం చేశారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, ఎంపీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

'ఉచిత చేపపిల్లల'ను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి విశ్వప్రసాద్,ఎంపీడీవో



చేపపిల్లలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సురేందర్

కారేపల్లి, అక్టోబరు22:ఆంధ్రజోతి)మండలంలోని 57చెరువుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేపపిల్లలను పెంచుకుని మత్స్యకారులు ప్రయోజకులు కావాలని ఖమ్మం జిల్లా మత్స్య శాఖ అధికారి జి.విశ్వప్రసాద్ అన్నారు. మంగళవారం కారేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలోని 24మత్స్యకారుల సంఘలకుగాను 5లక్షల,69వేల కట్ల, రవ్వ, బంగారుతీగ చేపపిల్లలను పంపిణీ చేశారు.జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులకు జిల్లా వ్యాప్తంగా 876 చెరువులగాను కోటి,75లక్షల చేపపిల్లలు మాత్రమే వచ్చాయన్నారు. అంటే గత సంవత్సరం కంటే ఈఏడాది 50శాతంమాత్రమే వచ్చాయన్నారు. ఇప్పటికి 104చెరువుల్లో 34లక్షల 50వేల పిల్లలను పోసిన్నట్లు విశ్వప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, ఇంచార్జీ ఎఫ్‌వో దొంతు సరిత, అసిస్టెంట్ ఎఫ్ఐ లక్ష్మణ్, నవీన్ మత్స్యసంఘల సభ్యులు పాల్గొన్నారు.

తల్లి కృషితో....
కుమార్తెకు ఉద్యోగం



తల్లి పద్మతో భార్గవి

మణుగూరు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తండ్రి చిన్నతనంలో మృతి చెందాడు.. తల్లి కుటుంబాన్ని పోషించుకునేందుకు కూలీగా మారింది. కూలీతోనే కూతురికి విద్యాబుద్దుల్ని నేర్పించింది. తల్లి కష్టాన్ని చిన్న తనం నుంచి చూసిన ఆ విద్యార్థిని చదువుల్లో అన్ని తరగతుల్లో మేలైన ఫలితాలను సాధించి ఉన్నత చదువులు చదివి, మైనింగ్ అధికారిగా ఉద్యోగాన్ని సాధించింది.

మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని పాత మణుగూరు గాంధీ బోమ్మ సెంటర్ పరిసరాల్లో నివాసముండే కుంచపు పద్మ రాజేందర్ దంపతుల కుమార్తె భార్గవి, తొమ్మిదో ఏటే తండ్రి రాజేందర్ మృతి చెందాడు.. తల్లి పద్మ కూలీ నాలి చేసుకుంటూ జీవనాన్ని సాగించింది. మణుగూరు ఓసీ లో కాంట్రాక్టు కార్మికురాలిగా కూడా పనిచేస్తూ కుమార్తెను బీటెక్ చదివించింది. భార్గవి తన తల్లి కష్టాన్ని దగ్గరుండి చూసి ఆమె కష్టానికి తగ్గ ప్రతిఫలంగా చదువుల్లో మేటిగా ఉంటూ వచ్చింది. బీటెక్‌లో 8.56 సీజీపీఏ ఉత్తీర్ణత సాధించింది. సింగరేణి యాజమాన్యం శనివారం ప్రకటించిన ఫలితాల్లో సింగరేణి మైనింగ్ అధికారిగా ఉద్యోగాన్ని సాధించింది. దీంతో ఆదివారం రిపోర్టు చేస్తూ ట్రైనీ అధికారిగా విధుల్లో చేరింది.

జాగీలం జూనోను అభినందించిన ఎస్పీ



పోలీస్ జాగీలం జూనోను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లోని పోలీస్ అకాడమీలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ - 2024 పోటీలలో పేలుడు పదార్థాలు(ఎక్సప్లోజివ్స్)ను కనిపెట్టే విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన జిల్లా పోలీస్ జాగీలం జూనోను ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా విభాగంలో 21 పోలీస్ జాగీలాలు పాల్గొనగా జూనో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతాకాన్ని సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. జూనో హ్యాండ్లర్ హుస్సేన్ ప్రశంసించారు. జాతీయ స్థాయిలో తన ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి పతాకాన్ని సాధించే విధంగా జూనో కు శిక్షణ ఇప్పించాలని సూచించారు. బంగారు పతకం సాధించి జిల్లాకు పేరు తీసుకొచ్చిన జూనోకు ఎస్పీ రివార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, ఆర్ఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్

» వైరా నడిబొడ్డున నిర్మించేందుకు ప్రతిపాదనలు
» టీజీఆర్ఎస్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ స్థలాల గుర్తింపు
» ప్రస్తుత గురుకులాల మనుగడపై కొరవడిన స్పష్టత
» పేద విద్యార్థులకు అందుబాటులోకి రానున్న మెరుగైన విద్య



వైరా, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైరా నడిబొడ్డున దాదాపు 40 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన రెండు బాలికల గురుకుల పాఠశాలలకు చెందిన స్థలాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్(వైఐఐఆర్ఎస్)ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈనెల 26న రాష్ట్ర మంత్రివర్గ కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం పొందేందుకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో వైఐఐఆర్ఎస్ నిర్మాణాలకు ఈనెల 11న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

20.08 ఎకరాల భూముల గుర్తింపు...

వైరాలో వైఐఐఆర్ఎస్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు 20.08 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. వైరాలోని రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల(టీజీఆర్ఎస్అండ్ జేసీ), తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల(టీజీఎస్‌డబ్ల్యూఎస్ అండ్ జేసీ) సంస్థలకు చెందిన ఖాళీ స్థలాన్ని వైఐఐఆర్ఎస్ కోసం గుర్తించారు.

ఎన్టీఆర్ 1983లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉమ్మడి రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సంచలనాలకు తెరలేపారు. వైరాలో ఏపీ గురుకుల బాలికల పాఠశాల(ఏపీఆర్ఎ‌స్)ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా పాఠశాలతోపాటు జూనియర్ కళాశాల కూడా ఏర్పాటైంది. ఇది తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీజీఆర్ఎస్ అండ్ జేసీగా రూపాంతరం చెందింది. 1985లో షెడ్యూల్ కులాల విద్యార్థుల కోసం ఏపీ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా బాలికల జూనియర్ కళాశాలగా రూపాంతరం చెందింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ అండ్ జేసీగా మారింది.

1983లో టీజీఆర్ఎస్‌కు 7.35ఎకరాలు, 1985లో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌కు 16.16ఎకరాల ఎన్నెస్పీ క్యాంపు స్థలాలను కేటాయించారు. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి అయిన వైరా-భద్రాచలం రోడ్డులో టీజీఆర్ఎస్ అలాగే వైరాలోని మధిర రోడ్డులో కూడా టీజీఆర్ఎస్‌తో పాటు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలు ఉన్నాయి. టీజీఆర్ఎస్‌కు 7.35ఎకరాలున్నప్పటికీ రెవెన్యూ అధికారుల సర్వే ప్రకారం ప్రస్తుతం 1.03ఎకరాల్లో మాత్రమే పాఠశాల తరగతి గది భవనాలు, వసతి భవనాలున్నాయి. మిగిలిన 6.32ఎకరాల ఖాళీ స్థలం ఉన్నట్లు రెవెన్యూశాఖ తమ సర్వేలో నిర్ధారించింది.

అలాగే టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో 16.16ఎకరాలకుగానూ మూడెకరాలు మాత్రమే వినియోగంలో ఉన్నట్లు రెవెన్యూశాఖ సర్వేలో నిర్ధారించింది. ఈ మూడెకరాల్లో తరగతి గదులు, వసతి గృహాలు నిర్మించి మిగిలిన 13.16ఎకరాల ఖాళీస్థలం ఉన్నట్లు సర్వేలో తేల్చింది. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ద్వారా కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందజేశారు.

1200మంది విద్యార్థినులు

వైరాలో 1983లో ప్రారంభించిన టీజీఆర్ఎస్ అండ్ జేసీలో, అలాగే 1985లో ఏర్పాటుచేసిన టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ అండ్ జేసీలో 1,200 మంది విద్యార్థినులు చదువుకునే సామర్థ్యం ఉంది. ఈ రెండు గురుకులాల్లో ఇప్పటికే నిర్మించిన తరగతి గదులు, వసతి గృహాల భవనాలను యథావిధిగా ఉంచుతారా..? లేక వాటిని కూల్చివేసి పునర్నిర్మిస్తారా..? అనేది తెలియాల్సి ఉంది. ఈ రెండు గురుకులాలను అక్కడే యథావిధిగా కొనసాగిస్తారా..? లేక ఇప్పుడు ఏర్పాటుచేసే వైఐఐఆర్ఎస్‌లో కలిపి ఆ గురుకులం కిందనే పరిగణిస్తారా..? అనే దానిపై స్పష్టత రావల్సి ఉంది. వైరా నడిబొడ్డున వైఐఐఆర్ఎస్‌ను నిర్మించడం వలన విద్యార్థులు, తల్లిదండ్రుల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

బంగారం చోరీ

మణుగూరురూరల్, అక్టోబరు22 (ఆంధ్ర జ్యోతి): మణుగూరు మండల పరిధిలోని సమితి సింగారం గ్రామంలో గల ముత్యాలమ్మ గుడిలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయంలోని అమ్మవారి విగ్రహానికి ఉన్న బంగారు, వెండి ఆభరణాలు దొంగలు అపహరించినట్లు స్థానిక ప్రజలు తెలిపారు. ఇటీవల కాలంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న మెడికల్ షాపులో సుమారు 40 వేల నగదును ఎత్తుకెళ్లగా, సీఎస్పీ కనక దుర్గా దేవి ఆలయంలో ఆలయ హుండీని స్వాహా చేశారు. అలాగే పీవీ కాలనీ లోని కోదండ రామాలయంలో కూడా దొంగతనం జరిగింది. వరుస దొంగతనాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

టేకు దిమ్మెల పట్టివేత

● కలప విలువ రూ.76వేలు ఉంటుందని వెల్లడి

దుమ్ముగూడెం అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): మూడు రోజులుగా కాపుకాసిన దుమ్ముగూడెం అటవీరేంజీ అధికారులు ఎట్టకేలకు మంగళవారం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన తొమ్మిది టేకు దిమ్మెలను పట్టుకున్నారు. స్మగ్లర్లు లింగాపురం బీటు సంగెం గ్రామం వద్ద చినగుబ్బల మంగి వాగులో టేకు దిమ్మలను దాచి ఉంచారనే సమాచారం అందుకున్న అటవీ అధికారులు దాడి చేశారు. పట్టుబడిన టేకు దిమ్మెల విలువ రూ.76,028లు కాగా వాటిని భద్రాచలం ప్రభుత్వ కలప డిపోకు తరలించారు. దాడుల్లో రేంజి అధికారి కమల, డీఆర్వో శోభన్‌బాబు సిబ్బంది ఉన్నారు.

నలుగురు బంగారం దొంగల అరెస్ట్

» 33 గ్రాముల బంగారం, రూ.27,400ల నగదు స్వాధీనం
» వివరాలు వెల్లడించిన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చుంచుపల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ చేసే నలుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఈ సంఘటనపై కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన పట్టణంలోని రైటర్ బస్తీ ప్రాంతానికి చెందిన సింగరేణి సంస్థలో సైంటిఫిక్ ఆఫీసర్‌గా పని చేసి రిటైర్డ్ అయిన వెంకటేశ్వరరావు తన భార్యతో కలిసి విద్యానగర్ కాలనీ ఎస్‌బీఐ బ్యాంకులోని లాకర్‌లో ఉన్న 19 తులాల బంగారు ఆభరణాలను దసరా పండుగ కోసం తీసుకొచ్చుకున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న సూపర్ మార్కెట్‌లో నిత్యవసర వస్తువులను కొనేందుకు ఇద్దరు కలిసి వెళ్లారు. కొనుగోలు చేసిన సామాగ్రిని ఆ షాపులో పని చేసే అతనితో తన కారు డిక్కీలో సర్దారు. ఈ క్రమంలో కారులోని ముందు సీటులో ఉంచిన బంగారు ఆభరణాలను సినీ ఫక్కీలో ఓ యువకుడు వచ్చి కారు డోర్ తీసి చాకచక్యంగా వ్యవహరించి ఆభరణాలు తీసుకొని వెళ్లి పోయాడు. గమనించిన వారు ఆ కారులో ఇంటికి వెళ్లిన ఆ దంపతులకు బంగారు ఆభరణాలు కన్పించకపోవడంతో చుంచుపల్లి పోలీసులను ఆశ్రయించాడు.

చోరీ జరిగిన సంఘటన స్థలానికి లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి ప్రాంతానికి చెందిన తంబళ్ల నితిన్, అలియాస్ రాజు, అలియాస్ నాని ముగ్గురు వ్యక్తులతో కలిసి ఆటోలో వచ్చాడు. ఆటోలో ఉన్న మరో ముగ్గురు నిందితులు ములుగు జిల్లా మంగపేట ప్రాంతానికి నిమ్మల వినయ్‌కుమార్ అలియాస్ చింటు, అలియాస్ పులి, లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతు వాగు ప్రాంతానికి చెందిన గుంజా వీరబాబు, కొత్తగూడెం పట్టణంలోని బూడిదగడ్డ ప్రాంతానికి చెందిన మహ్మద్ నహీంలు ఉన్నారు. వీరు నలుగురు ఒక ముఠాగా కలిసి బూడిదగడ్డ ప్రాంతంలో ఓ ఇల్లును అద్దెకు తీసుకొని నేరాలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన బంగారాన్ని తాకట్టు పెట్టి విలాసవంతమైన వస్తువులను కొనుగోలు చేశారు.

నిందితులు ఉపయోగించిన ఆటోను సీసీపుటేజీల ద్వారా వీరిని కనిపెట్టిన పోలీసులు, సీసీఎస్ పోలీస్ బలగాల సహకారంతో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం ఈ నలుగురు నేరం అంగీకరించినట్లు తెలిపారు. ఈ కేసులో మరికొంతమంది ఉన్నట్లు తెలుస్తుంద ని, వారి కోసం దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 33 గ్రాముల బం గారం, 3 ఫోన్లు, ఆటో, రూ.27,400ల నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితులను ప ట్టుకున్న చుంచుపల్లి, సీసీఎస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించి రివార్డును ప్రకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవికుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్ఐలు నవీన్, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



తప్పిదాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంటౌన్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో పంట నష్టపరిహారం విషయంలో తప్పిదాలకు పాల్పడిన వ్యవసాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాగు చేయని భూములకు, అసలు భూములే లేనివారికి కొందరు అధికారులు నేతల ప్రోద్బలంతో నష్ట పరిహారం అందించారన్నారు. ఈ విషయమై పూర్తి విచారణ జరపాలని, అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందించాలని పోటు ప్రసాద్ కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	జనక అయితే గనక..
శ్రీనివాస:	వెట్టయాన్
సాయిరాం:	విశ్వం
కేపీఎస్:	రాధేశ్యాం
తిరుమల:	దేవర

రేపు దుబాయ్ బైక్ రైడ్ ఎన్రోల్మెంట్ డ్రైవ్

జిల్లా ఉపాధికల్పన అధికారి

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మోడల్ కెరీర్ సెంటర్ గవర్నమెంట్ ఐటీఐ(టేకులపల్లి) ఖమ్మంలో గురువారం దుబాయ్ బైక్రైడ్ ఎన్రోల్మెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎన్.మాధవి తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఆయా సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె ప్రకటనలో తెలిపారు. దుబాయ్ (యూఏఈ)లో బైక్రైడర్స్ డెలివరీ బాయ్స్కి అధిక డిమాండ్ ఉన్నదని,ఆకర్షణీయమైన జీతంతో ఈ ఉద్యోగాలు ఉంటాయన్నారు. ఏదైనా ఫుడ్ డెలివరీలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, మరిన్ని వివరాల కోసం డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. టీఓఎం సీవోఎం. తెలంగాణ. జీవోవీ.ఇన్ సైట్లో నూ 9440049861,9440050951, 9440051452 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫార్మసీ కౌన్సిలింగ్కు 380 మంది విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టీజీ ఎఫ్సెట్ 2024 బీ ఫార్మసీ, ఫార్మాడీ కోర్సులలో చేరే విద్యార్థులకు మంగళవారం నగరంలోని ఎస్ఆర్బీ జీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. మొత్తం 395 మంది విద్యార్థులు స్లాట్ నమోదు చేసుకోని 380 మంది కౌన్సిలింగ్కు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు.

పన్నులు ఘనం.. అభివృద్ధి శూన్యం

- ఒకటో డివిజన్లో కనీస అవసరాలు లేక ప్రజల ఇబ్బందులు
- ఎండాకాలం తాగు నీరుతో, వర్షాకాలం మురుగునీరుతో ఇబ్బందులు
- డివిజన్ పరిధిలో డ్రెయినేజీ లేక రోడ్లు, ఇళ్ల మధ్యనే మురుగు నీరు
- సీసీ రోడ్లులేని విద్యానగర్, రైల్వే కాలనీ, టీఎన్జీవో కాలనీలు





సీసీరోడ్లు లేని రైల్వే కాలనీ మట్టి రోడ్లు, డ్రెయినేజీలేని డివిజన్ ప్రధాన రహదారి

డివిజన్ విజిట్

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని ఒకటో డివిజన్ కైకోండాయిగుడెంలో కనీస అవసరాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగు నీరు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు పూర్తిస్థాయిలో లేకపోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. గ్రానైట్ పరిశ్రమలతోపాటు కొత్తగా ఏర్పడుతున్న వివిధ కాలనీలలో ఇళ్ల పన్నులు ఆదాయం వస్తున్నా అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. డివిజన్కు సంబంధించి గ్రామసమోజీ, శివాలయం భూములు కొన్నేళ్లుగా వివాదంలోనే ఉండటం వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదు. దీంతో సుమారు రూ.50 కోట్ల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.

ప్రధాన సమస్యలు

ఇల్లెందు ప్రధాన రహదారి నుంచి కైకోండాయిగుడెం గ్రామంలోనికి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు నేటికి మెదలు కాలేదు. డివిజన్ పరిధిలో సుమారు 50 వరకు గ్రానైట్ పరిశ్రమలు పన్నులు కడుతున్నప్పటికీ కనీస అవసరాలైన తాగునీరు. రోడ్లు, వీధిదీపాలు లేక రాత్రి పూట వెళ్లే కార్మికులకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు ప్రమాదాలు సంభవించాయి. డివిజన్ పరిధిలో ఎక్కువగా పాల వ్యాపారులు ఉన్నారు. ఆవులు, గేదలు అధికంగా ఉండటంతో ప్రధాన రహదారుల వెంట డ్రెయినేజీ నిర్మాణం లేక రోడ్లపై మురుగు నీరు, పేడతో కంపు వస్తోంది. డివిజన్కు శ్మశానవాటిక, బస్తీదవఖానా మంజూరైనా నిధులు లేక ప్రాంభించలేదు.

వివాదంలో శివాలయం భూమి

డివిజన్కు సంబంధించి గ్రామంలో ఉన్న శివాలయానికి ఉన్న 20 ఎకరాల భూమిని కాజేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నా వారికి అధికార పార్టీకి చెందిన కొందరు సహకరిస్తున్నారని దేవాదాయశాఖకు చెందిన పలువురు అధికారుల చెబుతున్నారు. ఈ భూమిపై ప్రస్తుతం కోర్టు పరిధిలో వాదనలు నడుస్తున్నాయి. గ్రామానికి చెందిన సూమారు 22ఎకరాల గ్రామసమోజీ భూనికి సంభందించి గత కొన్నేళ్లగా వివాదం నడుస్తుంది. గ్రామంలోనే కొందరు ఈ భూమి నాదని, మరికొందరు ఇది రైతుల భూమి అని అంటూ వాదనలు నడుస్తున్నాయి. ఈ రెండు భూములు విలువ సూమారు రూ.50కోట్ల వరకు ఉంటుంది.

డివిజన్ పరిధిలో కాలనీలు

- ఒకటో డివిజన్ పరిధిలో కైకోండాయిగుడెం, టీఎన్జీవో కాలనీ, విద్యానగర్, రైల్వే కాలనీ, గణేష్నగర్ కాలనీలు ఉన్నాయి.
- జనాభా: మెత్తం 9వేలమంది జనాభా, ఓటర్లు 4800.
- రేషన్షాప్ ఒకటి, అంగన్వాడీ కేంద్రాలు రెండు ఉన్నాయి.

డ్రెయినేజీల లేక ఇబ్బందులు

విద్యానగర్, రైల్వేకాలనీలలో కనీస అవసరలైన రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిగా లేకపోవటంతో ఇళ్లలో వాడుకున్న నీరు, వర్షపు నీరు రోడ్లపై ఆగుతోంది. శ్మాశానవాటికకు రూ.30 లక్షలు మంజూరైనా స్థలవివాదంతో ప్రాంభం కాని పరిస్థితి నెలకొంది. గ్రామానికి రెండు చెరువులు ఉండగా ప్రజలు వాటిని గతంలో శ్మశాన వాటికలుగా వాడుకునేవారు. ప్రస్తుతం ఆచెరువులు కొందరు పట్టాలు చేయించుకోని అంత్యక్రియలను అడ్డుకుంటున్నారు. గ్రామానికి చెందిన ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లె దారికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో ఇళ్లలో వాడుకునే నీరు రోడ్ల వెంట ఆగుతోంది.

ఇళ్లల్లోనే మురుగు నీరు

గుండ్లపల్లి నరేష్, కైకోండాయిగుడెం



మా బజారుకు డ్రెయినేజీ లేకపోవటంతో వాడుకున్న నీళ్లు ఇంట్లోనే ఉంటున్నాయి. చేసేదిలేక ఇంట్లోనే ఇంకుడు గుంత తీసుకున్నాం.డ్రెయినేజీ మంజూరైనా కొందరు ర్యాంపులు పోతున్నాయనే ఉద్దేశ్యంతోనే అడ్డుకున్నారు. దీంతో ఇళ్ల మధ్యనే మురుగునీరు చేరి దోమలకు ఆవాసాలుగా మారాయి. కార్పోరేటర్ కాని ప్రజాప్రతినిధులు కాని పట్టించుకోవటంలేదు.

వర్షాకాలం రోడ్లమీద నడిసే పరిస్థితిలేదు

నున్నా శ్రీనివాసనావు, విద్యానగర్



విద్యానగర్ పరిధిలో రోడ్లు, డ్రెయినేజీ లేకపోవటంతో వర్షాకాలం రోడ్లమీద నడిసే పరిస్థితి లేకుండా పోయింది. ఇల్లెందు ప్రధాన రహదారి వెంట ఉన్న కూరగాయల వ్యాపారులు విద్యానగర్ బోర్డు వద్ద రోడ్డుకు అడ్డంగా ఆటోలు, ద్విచక్రవాహనాలు అడ్డు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మురుగునీరు, వర్షపు నీరు ఆగి ప్రయాణికులు కింద పడ్డ సంఘటనలు ఉన్నాయి.

మంత్రి పొంగులేటి సహకారంలో అభివృద్ధికి కృషి

తేజావత్ హుస్సేన్, కార్పొరేటర్



పాలేరు నియోజకవర్గం పరిధిలో ఈ డివిజన్ ఉంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో అభివృద్ధికి కృషిచేస్తున్నా. శ్మశానవాటిక, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు ఉన్నాయి. శ్మశానవాటికు రూ.30లక్షలు మంజూరైనా స్థలం లేకపోవటంతో నిర్మించలేదు. ఇప్పటి వరకు రూ. 2కోట్లతో సీసీ రోడ్లు, కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణాలు పూర్తి చేశాం. రూ.18కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపాం.

పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి

ఖమ్మంరూరల్,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామంలో రెండు నెలలుగా అపరిశుభ్రత తాండవిస్తోందని వెంటనే సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు పొన్నం వెంకటరమణ అధికారులను కోరారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో సైడ్డ్రెయిన్లలో బురద నీరు పేరుకుపోయిందని తెలిపారు. రేగులతండాలో కూడా పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుమలయ్య, బాస్కర్ రావు, మురళి, వేలాద్రి, సైదులు, నాగేశ్వర రావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నగరంలోని సంఘం నూతన భవనంలో నూతనంగా ఉద్యోగంలో చేరిన వారికి సర్వీస్ మేటర్స్పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎైవీ మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించే వివిధ రిజిస్టర్ల నిర్వహణ, ఎస్ఆర్ సర్వీస్ రిజిస్టర్ నిర్వాహణ, యాప్స్ వినియోగించే విధానంపై అనగాహన కల్పించారు. అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాపారావు, విజయ్ అమృత్, రత్నకుమార్, లక్ష్మణరావు శేఖర్రావు తదితరులు పాల్గొన్నారు.

పేరు ఎలా వచ్చిందంటే ?

మహాత్ముడి స్మారక చిహ్నం.. గాంధీచౌక్



ఖమ్మంసాంస్కృతికం, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ ప్రాంతం నగరంలోని కూడళ్లలో ప్రత్యేకతను కలిగిఉంది. బోసి నవ్వులతో మహాత్మా గాంధీ కూర్చున్న భంగిమలో శాంతిని ప్రబోదిస్తుంటాడు. వర్తక, వాణిజ్య హోల్సేల్ వ్యాపారాలతో అలరారుతున్న గాంధీచౌక్ ఏర్పాటుకు స్థానిక వ్యాపారులే పునాది వేశారు. గతంలో ఈప్రాంతం బహిరంగ వ్యవసాయ మార్కెట్గా ఉండేది. అందువల్ల ఈప్రాంతాన్ని బీటు బజార్ అని పిలిచేవారు. రైతుల వ్యవసాయోత్పత్తులను ఇక్కడే రాశులుగా పోసి క్రయ విక్రయాలు జరిపేవారు. 1946 ఫిబ్రవరి 5న గాంధీజీ ఖమ్మం సందర్శించారు.. దక్షిణ భారతదేశ యాత్రలో భాగంగా చెన్నైనుంచి సికింద్రాబాద్ వెళ్తున్న రైలులో గాంధీజీ ఖమ్మం వచ్చారు. ప్రత్యేక బోగీలో ఎంపిక చేసిన స్టేషన్ల పరిధిలో హిందీ ప్రచారంతోపాటు దేశస్వాతంత్ర పోరాటం దిశగా చైతన్య పరిచే ఉద్దేశ్యంతో ఆయన యాత్ర సాగింది. వెంకటగిరి గేటు ప్రాంతంలో రైలు హాల్టింగ్ తీసుకొని అక్కడే ప్రసంగానికి ఏర్పాట్లు చేశారు. పట్టాల వెంట గోడ పక్కనే చిన్నవేదిక నిర్మించటంతో గాంధీజీ అక్కడికి వచ్చి కొద్ది నిమిషాలపాటు హిందీలో ప్రసంగించారు. స్వాతంత్రం అనంతరం గాంధీజీ కాలు మోపిన ప్రాంతంలో వలయాకారంలో ఒక గద్దెను ఏర్పాటు చేయగా కొద్దిసంవత్సరాల క్రితం వరకు అది స్మారక చిహ్నంగా అలాగే ఉంది.. దానితోపాటు ప్రత్యేకంగా స్మారక మందిరం ఏర్పాటు చేయటం కోసం ఛాంబర్ ఆఫ్ కామర్స్ పూనుకుంది.. ఇందుకోసం రాజస్థాన్ నుంచి పాలరాతి గాధీజీ విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్ఠించారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ విద్యార్థుల ఫీజులు బకాయిలు చెల్లించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తోందని వాటిని వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ కోరారు. ఈమేరకు మంగళవారం ఖమ్మం కలెక్టరేట్లో కలెక్టర్ ముజామ్మిల్ఖాన్ను కలిసి వినతిపత్రం అందించారు. ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాలేజీలో పనిచేసే అధ్యాపకులకు జీతాలు చెల్లించే పరిస్థితి కూడా లేదని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, ఖమ్మం నగర అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్య, ఖమ్మం నగర ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

- కమిషనర్ అభిషేక్
- డంపింగ్యార్డును పరిశీలించిన కమిషనర్



ఆర్వో,ఆర్ఐలు సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థకు వ్యాపార రంగాలు, ఇతర ఆదాయ వనరులపై బిల్ కలెక్టర్లు దృష్టి సారించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశించారు. మంగళవారం కేఎంసీలో ఆర్వో, రెవెన్యూ ఇన్స్పెక్టర్లుతో కమిషనర్ అభిషేక్ సమావేశం నిర్వహించారు. బిల్ కలెక్టర్లు పనితీరు వారిడివిజన్లలో వసూళ్లు చేస్తున్న ఆదాయ వనరులు గుర్తింపుపై ప్రమాణికంగా ఉంటుందన్నారు. బిల్ కలెక్టర్లు వారీగా రెవెన్యూ వసూళ్లపై సమీక్షించారు. పాత రెవెన్యూ డివిజన్లలో ఆదాయ వసూళ్లు తక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల బిల్కలెక్టర్లు పనితీరు మార్చుకోవాలని కమిషనర్ హెచ్చరించారు. ప్రతీ డివిజన్లో వ్యాపార సంస్థలు, సినిమా హాళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్లు, గోడౌన్లు, హాస్పటల్స్ ఎన్ని ఉన్నాయో లెక్కలు తీయాలని ఆదేశించారు. గతంలో నోటీసులు ఇచ్చినా స్పందించని వ్యాపార సంస్థలను సీజ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. భవనాలు లేక పోయినా బిల్లులు వస్తున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయని వాటిపై విచారణ చేయాలని ఆదేశించారు. ప్రతి వ్యాపారానికి ట్రేడ్ లైసెన్స్లు మంజూరు చేయాలని ఆదేశించారు.

డంపింగ్యార్డు పరిశీలన

ఖమ్మం డంపింగ్యార్డును కమిషనర్ అభిషేక్ మంగళవారం పరిశీలించారు. కంపోస్ట్ ఎరువుల తయారీని తనిఖీ చేశారు. కూరగాయల మార్కెట్ నుంచి తరలించిన వ్యర్థాలను వినియోగంపై పలు సూచనలు చేశారు. తడి, పోడి చెత్తను కంపోస్ట్ తయారి చేసి మొక్కలను వేయాలని ఆదేశించారు.

సురక్షితంగా దీపావళి జరుపుకొనేలా చర్యలు

- అదనపుకలెక్టర్ శ్రీజ
- బాణసంచా షాపుల ఏర్పాట్లు, జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు సురక్షితంగా దీపావళి జరుపుకునేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో దీపావళి టపాసుల షాపుల ఏర్పాట్లు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 31న జరుపుకునే దీపావళీ పండుగకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. పోలీస్, మునిసిపల్, రెవిన్యూ, పంచాయతీ తదితర శాఖలన్ని సమన్వయంతో పనిచేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్థానిక ఎస్సార్బీజీఎన్నార్ కళాశాల మైదానంలో టపాసుల షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. షాపుల ఏర్పాటు అనుమతుల మంజూరులో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. అగ్నిమాపకశాఖ ఎన్ఓసీ, మునిసిపల్, గ్రామ పంచాయతీ అనుమతులు ఉండాలన్నారు. షాపులు ప్రేలుడు రహిత సామగ్రితో తయారై ఉండాలన్నారు. షాపు షాపుకు కనీసం 3 మీటర్ల దూరం పాటించాలన్నారు. ఎదురెదురుగా షాపుల ఏర్పాటు వుండరాదన్నారు. ఒక క్లస్టర్ లో 50 షాపులకు మించి ఉండకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఎస్పి ఏసీపీ సాంబరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.అజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా పాల్గొన్నారు.

'దళితబంధు' నిధులు మంజూరి చేయాలి

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు నిధులు మంజూరు చేసి వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని మధిర నియోజకవర్గం బీఆర్ఎస్ బొమ్మెర రామ్మూర్తి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్కి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకంతో ఎంతో మంది దళితులు ఆర్థికంగా బలోపేతం అయ్యారు. కాంగ్రెస్ ప్రజలను అబద్దాలతో మోసం చేసినట్లు దళితులను కూడా మోసం చెయ్యాలని చూస్తున్నారు. దళితబంధు పేరుతో మంజూరై కలెక్టర్ అకౌంట్లో ఉన్న నిధులను లబ్ధిదారుల ఖాతాలో జమచెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నెమలి కిషోర్, అరేంపుల వీరభద్రం, నేరెళ్ల, ఆరోన్, వెంకటేష్, మాధవి, శివాజి వెంకటేష్ పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర అమలు చేయాలి

కిసాన్మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్రెడ్డి

ఖమ్మంబైపాస్రోడ్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన పత్తికి మద్దతు ధరను పకడ్బందీగా అమలుచేయాలని బీజేపీ కిసాన్మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు పండించే ఏ పంటకు బోనస్ ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత మంత్రులు సీసీఐ కొనుగోలు కేంద్రాలలో హడావుడి చేస్తూ రైతులను ఉద్ధరిస్తున్నట్టు ప్రచారం చేసుకోవడం విడ్డూరమన్నారు. పత్తి రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో పాటు సీసీఐ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించిందని, దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రైతుకు అందేలా మార్కెటింగ్శాఖ అధికారులు చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, గుత్త వెంకటేశ్వర్లు, మంద సరస్వతి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, గుగులోత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు విస్మరిస్తే సహించేది లేదు

ఖమ్మంరూరల్, అక్టోబర్ (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు హమీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తే సహించేది లేదని ఎంఆర్పీఎస్ పాలేరు డివిజన్ ఇన్చార్జీ వంగూరు ఆనందరావు అన్నారు. మండల పరిధిలోని తల్లంపాడు, మద్దులపల్లి గ్రామాల్లో మంగళవారం సంఘం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతు ఇప్పటికే డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయలేదన్నారు. తరువాత చేపట్టబోయే ఉద్యోగాల్లో వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న ఖమ్మంలో నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్రావు, అశోక్, రాములు, కుమార్, రాము, వినయ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

తిరుమలాయపాలెం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బుర్ర ఉపేంద్రసాహూ పేర్కొన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో బీఎస్పీ పాలేరు అసెంబ్లీస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమల్లో విఫలమైందన్నారు. జీవో నెంబరు 29రద్దుచేయాలని అన్నారు. ఈ సమా వేశంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నాగేశ్వరరావు, నాగరాజు, రమేష్, రాజేంద్రప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

డీసీసీబీ సీఈఓ వసంతరావు

నేలకొండపల్లి,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల నుంచి తీసుకుంటున్న వ్యవసాయ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ వసంతరావు రైతులను కోరారు. మంగళవారం పైనంపల్లి సహకార సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులకు దాదాపుగా రూ.30లక్షల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు నాగుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో వసంతరావు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల రుణాలను అందిస్తున్నామన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలందించటానికి చర్యలు తీసుకుంటునట్లు సీఈఓ చెప్పారు. రైతులు సహకార సంఘాల ద్వారా తీసుకునే ప్రతి రూపాయి వ్యవసాయ పెట్టుబడిగానే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ, నేలకొండపల్లి బ్రాంచి మేనేజర్ ఇందు, సూపర్వైజర్ నాగప్రసాద్, సొసైటీ సీఈఓ జగదీష్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
ZONE
బుధవారం 23 అక్టోబరు 2024
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
8
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

ఆర్టీసీలో కమర్షియల్ షాపులకు టెండర్ల ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో కమర్షియల్ షాపులకు టెండర్ల ఆహ్వానిస్తున్నట్లు డీఎం యు.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లిలోని 13షాపులకు (ఏ క్లాస్) ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నామని, వీఎం.బంజర్, అశ్వారావుపేట బస్టాండ్లలో (బీ క్లాస్) నేరుగా దరఖాస్తులను సంప్రదించాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు కార్యాలయ పనివేళల్లో ఆఫీస్ సూపరింటెండెంట్‌ను నవంబరు 6వ తేదీలోగా సంప్రదించాలని, ఇతర వివరాలకు టీజీఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌గానీ, 99635 07506, 98666 19189 ఫోన్ నంబర్లను గానీ సంప్రదించాలని డీఎం కోరారు.

రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఏడీఏ స్వర్ణ విజయచంద్ర

ముదిగొండ, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర సూచించారు. మంగళవారం ముదిగొండ మండలం మాధాపురం రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త దామోదర్‌రాజు ప్రస్తుతం వరిలో వచ్చే తెగుళ్లు వాటి నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వరి, పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని కొనుగోలు కేంద్రాల్లోనే తమ ఉత్పత్తులను అమ్ముకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రఘు, నాగూల్ మీరా, లిఖిత, ఇందు, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

జాతి గర్వించదగ్గ వ్యక్తి కొమరం భీమ్



కొమరం భీమ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): జాతి గర్వించదగ్గ వీరుడు కొమరం భీమ్ అని పలువురు ఆదివాసీ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం కొమరం భీమ్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల స్వేచ్ఛకై అజేయంగా నిలిచిన అతని ధైర్యం, త్యాగం తరతరాల వరకు స్మరించబడుతుందన్నారు. ఆదివాసీ హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసిన అడవితల్లి ముద్దుబిడ్డ జయంతిని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూచి గోవర్ధన్, భోగి వీరాస్వామి, మారుతి బాబూరావు, కారం గంగరాజు, నరేష్, కిషోర్, కాసిని రాజులు, రాజేష్, రవి, రాజారావు, మోహనరావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి

● పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు

మధిర, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రతి ఒక్కరి మన్ననలు పొందాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు సూచించారు. స్థానిక టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్. బ్రహ్మారెడ్డి అధ్యక్షతన నూతన ఉపాధ్యాయులకు విధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను వారికి అర్థమయ్యేలా బోధించాలని అన్నారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, సంగిరెడ్డి, నాగరాజు, నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి వైరాలో లయన్స్‌క్లబ్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరులను గుర్తుచేసుకుంటూ కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, లయన్స్‌క్లబ్ చింతలపూడి వెంకటేశ్వరరావు, సభ్యులు చింతోజు నాగేశ్వరరావు, ఏడునూతల బుచ్చిరామారావు, రమేష్, మరికంటి రాంగోపాల్, షేక్.లాల అహ్మద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాష్ట్ర ధాన్యం చెక్‌పోస్టు ప్రారంభం

బోనకల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపం లో గల వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారి పక్కన అంతరాష్ట్ర సరిహద్దు ధాన్యం తనిఖీ చెక్‌పోస్టును మంగళవారం అధికారులు ప్రా రంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలకు రాకుండా కట్టడి చేయడమే లక్ష్యంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా ధాన్యం తరలిస్తే చర్య లు తీసకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, సివిల్ సప్లయ్ డీటీలు రాంచందర్, సత్యనారాయణ లు, ఎస్ఐ మధు బాబు, ఆర్ఐ లక్ష్మణ్‌లు ఉన్నారు.



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న అధికారులు

'ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి'

బోనకల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్యలు సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా నిర్వహించే పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రమాణాలను పెంచేలా కృషి చేయాలని సూచించారు.

'విశాల ప్రాంగణం కలిగిన స్కూళ్లను గురుకులాలుగా మార్చాలి'

వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాల ప్రాంగణం కలిగిన గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను సేమి రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు కోరారు. వైరాలో మంగళవారం మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన జరిగిన స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ మోడల్ విద్యాసంస్థలు మాత్రమే విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురాలేవని అభిప్రాయపడ్డారు. ఒకేచోట రెండు, మూడువేల మంది విద్యార్థులకు వసతులు కల్పించడంలో ఇబ్బందులు తలెత్తుతాయని అందువలన విశాల ప్రాంగణం కలిగిన గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను సెమి రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చాలని కోరారు. సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, పారుపల్లి చంద్రశేఖర్‌బాబు, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

కట్టలేరు నదిలో యువకుడి గల్లంతు

ఎర్రుపాలెం అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులదేవరపాడు గ్రామంలో గల కట్టలేరు నదిలో మంగళవారం చేపలవేటకు వెళ్లిన యవకుడు గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు గ్రామానికి చెందిన గంతాల వెంకటేశ్వరరావు(30) అనే వ్యక్తి చేపల వేటకు వెళ్లి కట్టలేరులో పెరిగిన ఉద్రుతికి ప్రమాదవశాత్తు కట్టలేరులో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎర్రుపాలెం ఎస్ఐ పి.వెంకటేశ్ మధిర రెస్క్యూటీమ్‌తో కలసి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రివరకు అతడి ఆచూకీ లభించలేదని ఎస్ఐ తెలిపారు. వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు ఉన్నారు.

అంబులెన్స్- లారీ ఢీ

●ఆరుగురికి గాయాలు

తల్లాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తల్లాడ బస్టాండు సమీపంలో మంగళవారం రాత్రి అంబులెన్స్- లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండ లం మునుకొళ్ల నుంచి అనారోగ్యానికి గురైన వృద్ధురాలు సీహెచ్. కనకమ్మను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తున్న అంబులెన్స్ ముందున్న కారును ఓవర్ టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది.

ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న కనకమ్మతో పాటు డ్రైవర్ ఎన్.ప్రభాకర్, ఆర్ఎంపీ వైద్యుడు డి.గోపి, సీహెచ్. కోటయ్య, కృష్ణమ్మ, ఆర్. కృష్ణవేణిలు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి ఎస్ఐ కొండల రావు చేరుకొని ప్రమాదానికి గురైన అంబులెన్స్- లారీలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. రెండు 108 వాహనాల్లో క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

» ఫిల్లర్ల దశలోనే ఆగిపోయిన నిర్మాణాలు » వినియోగంలోకి తేవాలని స్థానికుల వినతి

వైరా, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రమైన వైరాలో నాలుగేళ్ల కిందట చేపట్టిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా పడి ఉంది. దీని నిర్మాణం పూర్తయ్యేదెన్నడోనని స్థానికులు నిట్టూర్చుతున్నారు. దాదాపు రూ.నాలుగున్నర కోట్లతో ఈ వెజ్,నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టారు. వైరా నడిబొడ్డున ఎంతో విలువైన నీటిపారుదలశాఖ స్థలాల్లో చేపట్టిన ఈ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. జాతీయ ప్రధాన రహదారి నుంచి మధిర-జగ్గయ్యపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును అనుసంధానం చేస్తూ ఎల్ ఆకారంలో ఈ మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. జాతీయ ప్రధాన రహదారి వైపు వెజ్‌మార్కెట్, మధిర-జగ్గయ్యపేట రోడ్డు వైపు నాన్‌వెజ్ మార్కెట్‌ను చేపట్టారు. ఈ నిర్మాణాలకు ఇప్పటికే రూ.రెండున్నరకోట్లకుపైగా ఖర్చు చేశారు.

గత కలెక్టర్ నిత్యం పర్యవేక్షించినా ఫలితం శూన్యం...

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి కార్పొరేషన్, మునిసిపాలిటీ కేంద్రాల్లో వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణాన్ని చేపట్టారు. దానిలో భాగంగా అప్పటి జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ వ్యాపార వాణిజ్యానికి ఎంతో అనువుగా ఉండే విధంగా నీటిపారుదలశాఖ భూముల్లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు అంకుర్పాణ చేశారు. ఆయన ఇక్కడున్న సమయంలో నెలకోసారి వైరా వచ్చి ఈ మార్కెట్ నిర్మాణాలను పర్యవేక్షించారు. అయినప్పటికీ నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. గతంలో మధిర-జగ్గయ్యపేట రోడ్డు వైపు ఉన్న కూరగాయల మార్కెట్‌ను తాత్కాలికంగా హరితా రెస్టారెంట్ ఆవరణంలోకి తరలించా రు. మొదట కూరగాయల వ్యాపారులు అక్క డి నుంచి కదిలేందుకు నిరాకరించడమేకాకుండా హైకోర్టును ఆశ్రయించి స్టే కూడా తెచ్చారు.

అప్పటి ఎమ్మెల్యే హామీతో...

అప్పటి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ హామీతో కూరగాయల వ్యాపారులు తాత్కాలికంగా హరితా రెస్టారెంట్ ఆవరణంలోకి తరలివచ్చారు. దాంతో వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్‌కు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. నిధుల కొరత ఏర్పడటంతో అప్పటి కలెక్టర్ గౌతమ్ మౌఖిక ఆదేశాలతో మునిసిపాలిటీ నుంచి కొన్నిలక్షలరూపాయలను తాత్కాలికంగా సర్దుబాటు చేశారు. అయినా వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం పూర్తికాలేదు.



అసంపూర్తిగా ఉన్న వెజ్‌మార్కెట్ నిర్మాణం

ఏడాది నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...

ఏడాది నుంచి వీటి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అనే చందంలా ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందునుంచే వీటి నిర్మాణాలు నిలిచిపోయాయి. డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి నిర్మాణం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్‌ను ఏర్పాటుచేస్తారా...? లేక ఇతర అవసరాల కోసం ఈ భవనాలను ఉపయోగించేవిధంగా నిర్మాణాలు చేస్తారా అనే దానిపై కూడా సందేహాలు తలెత్తుతున్నాయి. రెండురోజుల కిందట వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,536కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటనలు వెలువడ్డాయి. వైరాకు కూడా ఆనిధులు కేటాయించి నిర్మాణాలు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక కూరగాయల మార్కెట్ ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను పూర్తి స్థాయిలో నిర్మించి, అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చేప పిల్లల పంపిణీ

ఏన్కూరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏన్కూరులో చేప పిల్లలను ఎంపీడీవో రమేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏన్కూరు మండలానికి లక్షా60వేల చేపపిల్లలను పంపిణీ చేశారు. గార్లొడ్డు, కేసుపల్లి, జన్నారం, మేడేపల్లి, నాచారం, బురదరాఘవాపురం, సూర్యతండా గ్రామాలకు చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీవో జీవీఎస్ నారాయణ, పిషరీష్ అసిస్టెంట్లు గ్రీష్మ, రఘుపతి, రాజేష్, రమణ, రాము పాల్గొన్నారు.



చేపపిల్లల పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రమేష్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

వైరా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండలంలోని 33 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ రూ.33లక్షల పైచిలుకు చెక్కులను, సీఎంఆర్ఎఫ్ కింద 34మందికి రూ.14లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని పేర్కొన్నారు. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ కట్ల రంగారావు, నాయకులు రాంపూడి రోశయ్య, పాలేటి నర్సింహారావు, బొర్ల గంగారావు, సూర్యదేవర శ్రీధర్, ఇటుకల మురళీ, మంచల జయరాజు, మట్టూరి కృష్ణారావు, షేక్.సైదా, నర్వనేని అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, మల్లు రామకృష్ణ, జవ్వాజి నాగరాజు, కొలికొండ వీరభద్రరావు, తుమ్మల సత్యం, నాగనబోయిన కృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆశీర్వాదం

తల్లాడ, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని పినపాక గ్రామానికి చెందిన మోదుగు ఆశీర్వాదం నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాలని వినతి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు తమకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ మంగళవారం ఎంఈవో నక్కా రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌లో ధరలు ఆకాశాన్నంటుతుంటే విద్యార్థులకు సరైన పౌష్టికాహారం పెట్టడం వీలుపడటం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా పెండింగ్ వేతనాలతో పాటు మెస్ చార్జీలు పెంచి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మటూరి రామకృష్ణ, మహదేవలక్ష్మి, షేక్ రహీంమున్నీసా, జె.వెంకటలక్ష్మి, పూచి సీత, సక్కుబాయి, శ్రీలక్ష్మి, జరీనా, అనసూర్య, నాగలక్ష్మి, సుజాత, రాములమ్మ, కృష్ణవేణి, రత్నమాల, సుశీల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'షార్ట్‌హ్యాండ్ విద్యకు ఎంతో ప్రాధాన్యత'

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించే అన్ని రకాల స్టెనో గ్రాఫర్, టైపిస్టు తదితర ఉద్యోగాలకు అర్హత సాధించేందుకు షార్ట్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని షార్ట్ హ్యాండ్ ఉపాధ్యాయుడు కె. సత్యనారాయణమూర్తి అన్నారు. కల్లూరులోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో మంగళవారం షార్ట్ హ్యాండ్ విద్యపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూన్నారు. విద్యార్థులు కళాశాలల్లో బోధిస్తున్న విద్యతో పాటు అదనంగా సాంకేతిక విద్య ఉంటే ప్రభుత్వ కొలువులు సాధించడం తమ సొంతమవుంతుదని చెప్పారు. షార్ట్ హ్యాండ్ నేర్చుకోవటం వల్ల ఇంగ్లీష్‌లో రాయడం, మాట్లాడడం సులభతరమని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ విద్యా సంస్థల అధినేత లక్కినేని ప్రసాద్ మాట్లాడుతూ పట్టుదల, కృషి ఉంటే విద్యార్థులు ఏ రంగంలోనైన విజయం సాధిస్తారని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు వెదుళ్ల చెరువు సర్వే

తల్లాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని వెదుళ్ల చెరువు పూర్తి నీటినిల్వ సామర్థ్యం(ఎఫ్‌టీఎల్) నిర్ధారణ కోసం మంగళవారం రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు సర్వే చేపట్టారు. వర్షం కురవడంతో సర్వే అసంపూర్తిగా నిలిచిపోయింది. వెదుళ్ల చెరువు లోతట్టు విస్తీర్ణం 113ఎకరాలకనుగుణంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారించేందుకు భూసర్వే విభాగం ఖమ్మం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ధర్మారావు ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. చెరువునిండా నీళ్లుండటం, వర్షం రావడంతో సర్వేను తాత్కాలికంగా నిలిపివేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ భాస్కర్, మండల సర్వేయర్ భరత్, నీటిపారుదలశాఖ ఏఈ పాల్వాయి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహించే పదవ తరగతి, ఇంటర్‌మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు గాను ఈ నెల 30 తేదీ వరకు అపరాధ రుసుముతో గడువు పెంచడం జరిగిందని స్థానిక విజ్ఞాన్ పాఠశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ యస్‌కె ఇస్మాయిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ కుటుంబాలకు వైద్య పరీక్షలు

మధిర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉద్యోగుల కుటుంబ సభ్యులకు గ్రాండ్ హెల్త్ చెకప్ పథకాన్ని మధిరలో డీపో మేనేజర్ శంకర్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల కుటుంబ సభ్యుల ఆరోగ్య పరీక్షల కార్యక్రమం మధిరలో మూడు రోజులు కొనసాగుతుందని తెలిపారు. అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకొని సంపూర్ణఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ జీవీరావు, రాణి, ఎంఆర్‌సీ రావు, హెల్త్ వాలంటీర్లు ఇస్మాయిల్, సరస్వతి, తదితరులున్నారు.

'నష్ట పరిహారం అందించాలి'

బోనకల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో పంట నష్టం సంభవించిన రైతులు తమకు పరిహారం అందలేదంటూ వ్యవసాయాధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నారు. కొందరికీ మాత్రమే పరిహారం రావడంతో తమ పొలాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని బాధిత రైతులు మండి పడుతున్నారు. రాపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు మంగళవారం బోనకల్ రైతు వేదిక కార్యాలయానికి వచ్చారు. తమకు పరిహారం వచ్చిన రైతుల జాబితాను ఇవ్వాలని అడిగారు. తరువాత ఇస్తామని చెప్పడంతో ఏవో నాగేశ్వరావును రైతులు నిలదీశారు. నష్టపోయిన పొలాలను గుర్తించకుండా, దెబ్బతినని పొలాలకు పరిహారం ఇవ్వడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. అర్హులైన వారందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆళ్లపాడు గ్రామానికి చెందిన పారా వెంకట మోహన్‌రావు, తోటకూర వెంకటేశ్వరరావు, బుంగ రాములు, మలాది లింగ య్య తదితరులు రైతులతో కలిసి జేడీఏను కలవనున్నట్లు తెలిపారు. తమ గ్రామంలో పంట నష్ట పరిహారం అర్హులకు రాలేదని, విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. పంట నష్ట పరిహారం అంశం రైతుల్లో మంటలు రేపుతుండటంతో వారిని చల్లబరిచేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు.

వరిపైరు రక్షణలో రైతుల కష్టాలు

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) తుఫాన్‌ల ప్రభావంతో ఆకస్మాత్తుగా వస్తున్న గాలి, వానలతో వరి పైరు పూర్తిగా నేల వాలగా పలువురు రైతులు పొల్లాలో నీటిని నిల్వ ఉండకుండ బయటకు తరలించే ప్రయత్నంలో పడ్డారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి పైరు పక్వానికి రాగా పలు గ్రామాల్లో త్వరలో యంత్రాలతో వరి కోతుల కోయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ దశలో ఆకస్మాత్తుగా గాలి, వానలతో వరద నీరు మడులలో చేరింది. మరో వైపున ఏపుగా ఏదిగిన వరి పైరు పూర్తిగా నేల అడుగు భాగానికి తాకింది. దీంతో వరి పనలు నీటి తేమతో కంకులు కుళ్లి మొలకలు రావడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. ఈ దశలో నేలవాలిన వరి పైరుకు నష్టం జరగకుండా రైతులు రెండు రోజుల నుంచి పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని కాలువలు ఏర్పాటు చేసి బయటకు తరలిస్తున్నారు. ఇదే పనిగా రైతులంత పైరును రక్షించునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఇంత చేసిన వర్షపు నీరు నేల వాలిన పనల కింద చేరటంతో అంతిమంగా వరి పంటకు నష్ట అంతో ఇంతో జరుగుతుంది. ప్రకృతి అనూకూలిస్తే రైతుకులకు మేలు జరుగుతుందని ఆశ పడుతున్నారు.



వరి పైరులో చేరిన నీటిని కాలువల ద్వారా బయటకు తరలిస్తున్న రైతులు

రక్తదానం చేద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం

సత్తుపల్లి, అక్టోబర్22 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాలలో రక్తదానం చేసి ప్రజల ప్రాణాలను కాపాడుకుందామని బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ.ఛటర్జీ అన్నారు. మండలంలోని 15వ పోలీస్ బెటాలియన్‌లో పోలీస్ ఫ్లాగ్ డే-2024దినోత్సవాలలో భాగంగా బెటాలియన్‌లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్డీ.రంగారెడ్డి, సత్తుపల్లి సీహెచ్‌సీ వైద్యులు పీ.రాజేష్, బెటాలియన్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది